సాక్షి
జగిత్యాల
ఆదివారం । 6 । ఆగస్టు । 2023

సాక్షి టాక్ షో
స్పెషల్ స్టోరీస్
సండే స్పెషల్



కరీంనగర్‌లో శ్రీచైతన్య డిగ్రీ కళాశాల విద్యార్థినులు



తిమ్మాపూర్ వాగేశ్వరి ఫార్మసీ విద్యార్థులు



స్నేహం.. ఓ వరం

- అనుకోకుండా పరిచయమై, జీవితాంతం తోడుంటుంది..
- కష్టనష్టాల్లో అండగా ఉండేవారే మిత్రులు
- నేడు స్నేహితుల దినోత్సవం

కరీంనగర్ సిటీ/విద్యానగర్(కరీంనగర్)/: 'స్నేహానికి కన్న మిన్న లోకాన లేదురా.. కడదాక నీడ లాగ నిను వీడిపోదురా' అని ఓ కవి అన్నట్లు స్నేహబంధం ఎప్పటికీ మనతోనే ఉంటూ మన జీవితంలో భాగమవుతుంది. అది ఓ వరం. పుట్టినప్పుడు మనతోపాటు ఎన్నో బంధాలు, రక్త సంబంధాలు ఏర్పడుతాయి. కానీ తర్వాత మన నడవడిక, వ్యక్తిత్వం ఆధారంగా స్నేహం మన జీవితంలోకి వస్తుంది. ఆపదలో ఆదుకుంటూ.. కష్టాల్లో పక్కనుంటూ.. ఎదుగుదలలో తోడుంటూ.. ఇలా రక్త సంబంధం చేయలేనిది కూడా స్నేహ హస్తం చేస్తుంది. మనం విజయం సాధించినప్పుడు చప్పట్లు కొట్టేవాళ్లు.. విషాదంలో ఉన్నపుడు ఓదార్చేవాళ్లు నలుగురు లేని జీవితాన్ని ఎవరూ ఊహించరు. అందుకే మనుషులందరికీ తలా ఓ పేరున్నప్పటికీ అందరినీ దగ్గరకు చేర్చేది మాత్రం స్నేహబంధమే. నేడు స్నేహితుల దినోత్సవం. ఈ సందర్భంగా కరీంనగర్‌లోని శ్రీచైతన్య డిగ్రీ కాలేజీలో 'సాక్షి' 40 మంది విద్యార్థులతో శనివారం చర్చావేదిక నిర్వహించింది. ఎక్కువ మంది ఆన్‌లైన్ స్నేహంలో మోసాలుంటాయని, నమ్మకం లేదని చెప్పారు. చిన్నప్పటి నుంచి ఉన్న స్నేహం బలంగా ఉంటుందని తెలిపారు.

పేరెంట్స్ తర్వాత ఫ్రెండ్సే..



పేరెంట్స్ తర్వాత ఫ్రెండ్సే ముఖ్యం. ఇంట్లో చెప్పలేని విషయాలు కూడా ఫ్రెండ్స్‌తో షేర్ చేసుకుంటాం. ఆపదలో ఒకరికి ఒకరు తోడుగా నిలిచేది ఫ్రెండ్సే. వారితో ప్రయాణం చాలా విలువైనది.

– అసాధ్య, ఫార్మ్ డీ, వాగేశ్వరి

ఒకరికొకరు తోడు..



స్నేహితులను ఎంచుకునే సమయంలో మంచి వారిని ఎంచుకుంటే జీవితంలో కష్టసుఖాల్లో తోడుంటారు. మంచి వారు ఎప్పుడూ ఒకరికొకరు తోడుంటారు.

– చందన, వాగేశ్వరి

స్వార్థం లేనిది..



నిస్వార్థమైనది స్నేహమొక్కటే. కష్టమొచ్చినా.. సంతోషమొచ్చినా తోడుండే వారే ఫ్రెండ్స్. నేను ఎక్కడో మహబూబాద్ జిల్లా నుంచి వచ్చిన. ఇక్కడ అందరూ అన్నదమ్ములుగా ఉండి స్నేహం విలువ తెలిపారు.

– ప్రశాంత్, వాగేశ్వరి

ఫ్రెండ్ అవసరమే..



ఆరు సంవత్సరాల ఫార్మసీ రంగంలో నాకు ప్రతీ ఫ్రెండ్ అవసరమే. కష్టసుఖాల్లో స్నేహితులే దేవుళ్లు. మా ఓర్పును భరించడమే కాకుండా జీవితంలో ముందడుగు వేయడానికి ప్రతీ స్నేహితుడు అవసరమే.

– అక్షయ, వాగేశ్వరి

విద్యార్థులే స్నేహితులు..



కళాశాలలో 20 సంవత్సరాల సుదీర్ఘకాలంలో మాకు విద్యార్థులను మించిన స్నేహితులు లేరు. ప్రతీ బ్యాచ్‌తో మాకు గొప్ప అనుభవం ఎదురవుతుంది. ఫ్రెండ్‌షిప్ విలువ తెలిసిన వారు జీవితంలో ఎదుగుతారు.

– శ్రీనివాస్‌రెడ్డి, ప్రిన్సిపాల్, ఫార్మసీ కాలేజీ

– తిమ్మాపూర్

నాలుగో తరగతి నుంచి డిగ్రీ వరకు..



మేము నాలుగో తరగతిలో పరిచయమయ్యాం. మా ప్రయాణం ఇబ్బంది లేకుండా డిగ్రీ వరకు వచ్చింది. ఎంతో స్నేహంగా ఉంటూ సంతోషాలు, బాధలను పంచుకుంటాం. కష్టాల్లో ఒకరికొకరం అండగా ఉంటాం.– కీర్తిక, కేజీయా, కొత్తపేట, బోయినపల్లి మండలం

స్నేహితులకే చెప్పుకుంటాం

తల్లిదండ్రులు, తోబుట్టువులు, బంధువులకు చెప్పుకోలేని చాలా సమస్యలను స్నేహితులతో చెప్పుకుంటాం. అనుకోకుండా పరిచయమై, జీవితాంతం నేనున్నా అంటూ వచ్చేది ఒక్క స్నేహమే.

– సుచరిత, శివాణి, పెద్దపల్లి



కష్టాల్లో ఆదుకునేలా ఉండాలి



స్నేహం కష్టాల్లో ఆదుకునేలా ఉండాలి. బాధలో ఉన్నప్పుడు మనసు విప్పి మాట్లాడితే సాంత్వన చేకూరుతుంది. ఒక మంచిమాటతో మనసును కుదుటపడేలా చేసి, ముందుకు నడిపించేది స్నేహమే. – భూమిక, జగిత్యాల

నమ్మకం.. నిజాయితీ ఉండాలి



నిజాయితీ, నమ్మకంతో కూడిన స్నేహం కావాలి. కానీ నేడు అవసరాలకు మాత్రమే చేస్తున్నారు. అవి తీరగానే దూరమైపోతున్నారు. జీవితాంతం తోడు నిలిచే స్నేహం ఆనందాన్నిస్తుంది.

– విద్య, తాళ్లపల్లి, ఇల్లంతకుంట మండలం

ఆ బంధం గొప్పది



స్నేహంలో ఆడ, మగ అనే తేడా ఉండదు. మన మంచికోరే వారితో ఫ్రెండ్‌షిప్ జీవితాంతం బాగుంటుంది. నేను ఎక్కువ సమయం స్నేహితులతోనే ఉంటా. స్నేహబంధం ఎంతో గొప్పది.

– కృష్ణతేజ, వేములవాడ

నలుగురం కలిసి చదువుకున్నం



కోరుకంటి శ్రీకాంత్, తణుకు శ్రీనాథ్, సుంచు మల్లయ్య, నేను నలుగురం స్నేహితులం. శిశు తరగతి నుంచి ఇంటర్ వరకు కలిసే చదువుకున్నం. అప్పటి స్నేహం ఇంకా కొనసాగుతోంది. అందరం జీవితాల్లో స్థిరపడ్డాం. ప్రతీ వారం కలుసుకుంటం. పండుగలు, శుభకార్యాలకు ఒకరింటికి ఒకరం వెళ్తాం. కష్టనష్టాల్లో తోడుగా ఉంటున్నం.

– రావుల సుధాకర్, కిసాన్‌నగర్, కరీంనగర్

వైద్యానికి సాయం



బోయినపల్లి(చొప్పదండి): బూర్గుపల్లికి చెందిన అక్కరాజు గంగరాజుది పేద కుటుంబం. తల్లి పడుతున్న కష్టాన్ని చూడలేక ఇంటర్ వరకు చదివి ఆపేశాడు. చిన్నాచితక పనులు చేస్తూ తల్లికి సాయంగా ఉండేవాడు. నెల రోజుల క్రితం కాలేయ సంబంధిత వ్యాధితో ఆస్పత్రిలో చేరాడు. విషయం తెలుసుకున్న అతని స్నేహితులు పెరుక మహేశ్ వాట్సాప్ గ్రూపుల ద్వారా రూ.1.37 లక్షలు సేకరించి, చికిత్స చేయించారు.

స్నేహబంధమే శాశ్వతం



సాక్షి, పెద్దపల్లి: స్నేహబంధమే శాశ్వతం. ఇప్పటికీ నా స్కూల్‌మేట్స్‌ను కలుస్తుంటా. నా బెస్ట్ ఫ్రెండ్ అమూద్. వాడు నేను అహ్మద్‌నగర్‌లో స్కూల్, కాలేజీ వరకు కలిసి చదువుకున్నాం. సివిల్స్ ప్రిపేర్ అవుతున్న సమయంలో నాలో కాన్ఫిడెన్స్ తగ్గకుండా ఎప్పుడూ మోటివేట్ చేస్తుండేవాడు. అమూద్ ఇంజినీర్‌గా, మిగతా మిత్రులు వివిధ దేశాలు, పట్టణాల్లో డాక్టర్లు, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా, ఉద్యోగులుగా, వ్యాపారులుగా స్థిరపడ్డారు. మేము ఎక్కడ ఉన్నా కష్టసుఖాల్లో పాలుపంచుకుంటాం. ఏటా టూర్ ప్లాన్ చేసుకుంటాం.

– వైభవ్‌గైక్వాడ్, పెద్దపల్లి డీసీపీ

8వ తరగతిలో పరిచయం



మేము ముగ్గురం 8వ తరగతిలో పరిచయమయ్యాం. డిగ్రీ వరకు కలిసే చదువుకున్నాం. ఏ సమస్య వచ్చినా చర్చించుకొని, పరిష్కరించుకుంటాం.

– కావ్య, వర్షిణీ, తేజస్విని, వేములవాడ

మిత్రుడి పేరిట స్కూల్..



విద్యార్థులకు మెమెంటోలు అందిస్తున్న గాజుల శ్రీనివాస్, మిత్రులు (ఫైల్)



దయానంద్ (ఫైల్)

సిరిసిల్ల: పట్టణంలోని పద్మనగర్‌కు చెందిన గోసికొండ దయానంద్ 2002లో ఆత్మహత్య చేసుకున్నారు. ఆయన యాదిలో చిన్ననాటి మిత్రులు ఏదైనా చేయాలని నిర్ణయించున్నారు. గాజుల శ్రీనివాస్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్, యూఎస్ఏ సిరిసిల్ల పట్టణ శివారులో 22 గుంటల స్థలం కొనుగోలు చేసి, రూ.30 లక్షలతో 2006లో దయానంద్ మెమోరియల్ స్కూల్ స్థాపించారు. ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు ఉచితంగా ఆంగ్ల మాధ్యమంలో విద్యనందిస్తున్నారు. రాజీవ్‌నగర్ కార్మిక క్షేత్రంలోని పేదవాళ్లు తమ పిల్లలను ఇక్కడికి పంపిస్తున్నారు. ప్రస్తుతం 65 మంది విద్యార్థులు ఉన్నారు. స్కూల్ నిర్వహణకు ఏటా రూ.5 లక్షలు ఖర్చవుతోంది. ఇందులో ఎక్కువ మొత్తాన్ని శ్రీనివాస్ భరిస్తున్నారు. బోడ రవీందర్, సిరిసిల్ల తిరుపతి, కట్కం గోపి, పయ్యావుల శ్రీనివాస్, బి.రాము, బొద్దు శ్రీధర్, లింగమూర్తి, సిరిసిల్ల తిరుమలేశ్, పూరడి రవి, కోడం సుధాకర్ పాఠశాల నిర్వహణలో భాగస్వాములవుతూ స్నేహానికి నిజమైన నిర్వచనంగా నిలుస్తున్నారు.

ఊరి నుంచి గల్ఫ్ దాకా..



స్నేహితులతో దేవ్‌యాదవ్ (సర్కిల్‌లో)

కథలాపూర్(వేములవాడ): మండలంలోని చింతకుంటకు చెందిన బైర దేవ్‌యాదవ్ ఉపాధి నిమిత్తం 12 ఏళ్ల క్రితం సౌదీ అరేబియా వెళ్లాడు. అక్కడ ఓ కంపెనీలో సరైన పని దొరికింది. తన స్నేహితులు గ్రామంలోనే వ్యవసాయం, కూలీ పనులు చేస్తూ ఆర్థికంగా ఎదగడం లేదని భావించాడు. ఒక్కొక్కరికి వీసా పంపిస్తూ 18 మందిని సౌదీ రప్పించుకొని, ఉపాధి చూపించాడు. చిన్నతనంలో గ్రామంలో అందరం కలిసి ఆడుకునే వాళ్లమని.. గల్ఫ్‌లో ఒకేచోట పని చేస్తుండటం ఆనందంగా ఉందని దేవ్‌యాదవ్ తెలిపాడు.

వైద్య మిత్రులు





పెంచలయ్య, పి.చంద్రశేఖర్, రమణారావు రిటైర్డ్ డీఎంహెచ్‌వో

సిరిసిల్ల: సిరిసిల్లకు చెందిన ప్రముఖ వైద్యులు పెంచలయ్య, రమణారావు, చంద్రశేఖర్ మంచి మిత్రులు. 40 ఏళ్ల క్రితం మెడిసిన్ చదువుతున్న రోజుల్లో ముగ్గురూ కర్నూలు మెడికల్ కాలేజీలో స్నేహితులయ్యారు. పెంచలయ్య కడప పట్టణానికి, ఎన్వీ రమణారావు నెల్లూరు జిల్లా సర్వేపల్లి మండలం నిడిగుంటపాలెంకు, చంద్రశేఖర్ నెల్లూరు పట్టణానికి చెందినవారు. ఎంబీబీఎస్ సెకండియర్ చదివే పెంచలయ్యకు ఫస్టియర్ చదివే రమణారావు, చంద్రశేఖర్‌ల మధ్య కాలేజీ ఫంక్షన్‌లో స్నేహం కుదిరింది. పెంచలయ్య, చంద్రశేఖర్ 1993లో సిరిసిల్లకు వచ్చి, ప్రాక్టీస్ ప్రారంభించగా.. 1995లో రమణారావు వచ్చారు. ప్రభుత్వ వైద్యులుగా సర్జన్ పెంచలయ్య, రిటైర్డ్ డీఎంహెచ్‌వో చంద్రశేఖర్, ఆర్థోపెడిక్ రమణారావు నిజాయితీకి మారుపేరుగా గుర్తింపు పొందారు.

జాలువారే అందాలు

- ఆహ్లాదం పంచుతున్న 'వెన్నముద్దల గండి'
- ప్రకృతిని ఆస్వాదిస్తున్న పర్యాటకులు

రాయికల్(జగిత్యాల): చుట్టూ పచ్చని చెట్లు.. ఎత్తయిన గుట్టలు.. వాటి మధ్య జాలువారే వెన్నముద్దల గండి జలపాతం.. ఇది ప్రకృతి ప్రేమికులను విశేషంగా ఆట్టుకుంటోంది. కట్కాపూర్ గ్రామ శివారులో నిత్యం పర్యాటకులతో సందడిగా కనిపిస్తోంది. జిల్లా కేంద్రానికి సుమారు 35 కి.మీ. దూరంలో ఇది ఉంది.



వెన్నముద్దల గండికి వెళ్లే మార్గంలో పర్చుకున్న పచ్చదనం



జలపాతం పారేది ఈ గుట్ట పైనుంచే..



వెన్నముద్దల గండి వద్ద పారుతున్న సెలయేరు.. కనువిందు చేస్తున్న పచ్చనిచెట్లు..

రెండు మండలాల సరిహద్దుల్లో..

- రాయికల్, బీర్‌పూర్ మండలాల సరిహద్దు కట్కాపూర్ గ్రామ శివారులో వెన్నముద్దల గండి జలపాతం ఉంది.
- ఎత్తయిన గుట్టల్లోంచి వర్షపునీరు జలజలాపారుతూ ఆకట్టుకుంటోంది.
- జగిత్యాల, నిర్మల్‌తోపాటు హైదరాబాద్, కరీంనగర్, వరంగల్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలకు చెందిన పర్యాటకులు ఇక్కడకు భారీసంఖ్యలో తరలి వచ్చి ప్రకృతి ఒడిలో సేదతీరుతున్నారు.
- ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో హన్మాతురాయి, గుట్టల మధ్యలోంచి వర్షపునీరు పారుతోంది. ఇది గోదావరి నదిలో కలిసిపోతోంది.

ఆనందంగా ఉంది



వెన్నముద్దల గండి పర్యాటక ప్రాంతం మా ఊరు శివారులోనే ఉంది. దీనిని చూసేందుకు మా కుటుంబ సభ్యులతో కలిసి వచ్చినం. వివిధ జిల్లాల నుంచి బస్సుల్లోనూ చాలామంది వస్తున్నారు. ప్రకృతి అందాలను ఆస్వాదించడం ఆనందంగా ఉంది.

– రాజమౌళి, సర్పంచ్, కట్కాపూర్

ఎంజాయ్ చేశాం



వెన్నముద్దల గండి జలపాతం పచ్చని చెట్లు, గుట్టల మధ్య ఎంతో ఆహ్లాదం పంచుతోంది. మా కుటుంబసభ్యులతో వచ్చినం. ప్రకృతి అందాలు చూస్తూ, జలపాతంలో ఎగురుతూ ఎంజాయ్ చేశాం. ఇలాంటి ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి.

– సిద్దంశెట్టి స్వప్న, పర్యాటకురాలు

పర్యాటక కేంద్రంగా గుర్తించాలి



రాయికల్ మండలం కట్కాపూర్ గ్రామంలోని వెన్నముద్దల గండి ప్రకృతి అందాలను పర్యాటక కేంద్రంగా గుర్తించాలి. ఈ ప్రదేశాన్ని చూడటం కోసం వరంగల్, కరీంనగర్, హైదరాబాద్ జిల్లాల నుంచి ప్రజలు తరలివస్తున్నారు. ప్రభుత్వం దృష్టి పెట్టాలి. – మెక్కొండ రాంరెడ్డి, రైతు

క్లుప్తంగా

అంజన్న ఆలయంలో భక్తుల రద్దీ


హుండీలో కానుకలు వేస్తున్న బాలుడు

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు శ్రీఆంజనేయస్వామి ఆలయంలో శనివారం భక్తుల రద్దీ పెరిగింది. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు భారీగా తరలివచ్చి క్యూలైన్ల ద్వారా స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కౌంటర్‌లలో ప్రసాదాలు కొనుగోలు చేశారు. అధికారులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

బాధ్యతలు స్వీకరణ



కోరుట్ల: కోరుట్ల మున్సిపల్ కమిషనర్‌గా టి.రాజేశ్వర్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన కమిషనర్ ఆయాజ్ రాజన్న సిరిసిల్ల జిల్లాలోని సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్‌గా బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో బాధ్యతలు స్వీకరించిన రాజేశ్వర్‌ను అధికారులు కలిసి అభినందనలు తెలిపారు.

శిక్షణ కేంద్రం సందర్శన


మాట్లాడుతున్న జగన్మోహన్‌రెడ్డి

మల్యాల(చొప్పదండి): ఉపాధ్యాయుల ఎఫ్‌ఎల్‌ఎం శిక్షణ కేంద్రాన్ని జిల్లా విద్యాధికారి జగన్మోహన్‌రెడ్డి శనివారం సందర్శించారు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు గుణాత్మకమైన విద్యను అందించడానికి ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నామన్నారు. అభ్యసన ప్రక్రియ మరింత మెరుగుపరడానికి ఉపాధ్యాయులకు లెసన్ ప్లాన్లు, విద్యార్థులకు కృత్య ధార పత్రాలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని చెప్పారు. అనంతరం తాటిపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌ను సందర్శించారు. పదో తరగతి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఏంఈవో శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయుడు గౌతంకృష్ణారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మొక్కలు నాటడం అందరి బాధ్యత

- అడిషనల్ కలెక్టర్ బీఎస్ లత

జగిత్యాల: పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటడం ప్రతీఒక్కరి బాధ్యత అని అడిషనల్ కలెక్టర్ బీఎస్ లత అన్నారు. స్థానిక ఎస్‌కేఎన్‌ఆర్ డిగ్రీ కళాశాలలో యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో శనివారం హరితహారం కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, ప్రజలకు బ్యాంకింగ్ సేవలతోపాటు, పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ డిప్యూటీ జోనల్ అధికారి అరవింద్‌కుమార్, రీజినల్ అధికారి శంకర్, లీడ్ బ్యాంక్ మేనేజర్ వెంకట్‌రెడ్డి, ప్రిన్సిపాల్ అశోక్, కౌన్సిలర్ తోట మల్లికార్జున్ పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మహిళా సంఘాలకే రుణాలు

- అదనపు కలెక్టర్ దివాకర


ఆగ్రహం వ్యక్తం చేస్తున్న అదనపు కలెక్టర్ దివాకర

జగిత్యాల: మెప్మా మిషన్ డైరెక్టర్ జారీచేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా మైక్రో క్రెడిట్ ప్లాన్‌లో భాగంగా ఆన్‌లైన్‌లో పొందుపర్చిన మహిళా సంఘాలకు మాత్రమే బ్యాంకర్లు రుణాలు మంజూరు చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దివాకర ఆదేశించారు. జిల్లా కేంద్రంలో ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. మెప్మా మిషన్ ఆదేశాలకు అనుగుణంగా బ్యాంకర్లు సూచనలు జారీచేయాలన్నారు. రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న సమయంలోనే మహిళా సంఘాల వివరాలను ఆన్‌లైన్‌లో నిర్ధారించుకోవాలని చెప్పారు. నకిలీ మహిళా సంఘాల పేరిట కొందరు రుణాల కోసం దరఖాస్తు చేసుకుంటున్నారని, అలాంటి వారికి బ్యాంకర్లు రుణాలు ఇస్తున్నారని తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. దరఖాస్తులతో ఆధార్‌జతచేస్తే రుణాలు దుర్వినియోగం కావని, ఎగవేతకు ఆస్కారం ఉండదని అన్నారు. మెప్మా సీవో, టీఎంసీలు ఆన్‌లైన్ ద్వారా ధ్రువీకరించిన మైక్రో క్రెడిట్ ప్లాన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న మహిళా సంఘాలకే రుణాలు మంజూరు చేయాలని ఆయన బ్యాంకర్లకు సూచించారు. 'ఉత్తుత్తి పొదుపు సంఘాలు' శీర్షికన ఇటీవల 'సాక్షి'లో కథనం ప్రచురితమైందన్నారు. అయితే, నకిలీ తీర్మానంతో దరఖాస్తులు చేయగా, వాటిపై విచారణ చేయకుండానే బ్యాంకర్లు రుణాలు మంజూరు చేశారని తెలిపారు. ఇందులో మెప్మా సిబ్బందికి సంబంధం లేదని స్పష్టం చేశారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

రాయికల్(జగిత్యాల): మున్సిపల్ అధికారులు విధుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని అదనపు కలెక్టర్ దివాకర హెచ్చరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మున్సిపల్ అధికారులతో సమీక్షించారు. వైకుంఠధామం, సమీకృత మార్కెట్, టీయూఎఫ్ఐడీసీ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులపై చర్చించారు. వర్షాకాలం సందర్భంగా మొక్కల పంపిణీపై ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పట్టణంలో అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను ఆదేశించారు. అనంతరం శ్రీరాంనగర్, ఆలూరు, వడ్డెరకాలనీ, ఒడ్డెలింగాపూర్, రామాజీపేట గ్రామాలు సందర్శించారు. శానిటేషన్ పనులు, ప్లాంటేషన్, వైకుంఠధామం, కంపోస్ట్‌షెడ్డు, పల్లె ప్రకృతి వనం, రోడ్ల పరిస్థితిని పరిశీలించారు. ముఖ్యంగా వర్షాలు కురవడంతో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, శానిటేషన్‌పై దృష్టి సారించాలని సూచించారు. డీఎఫ్‌వో వెంకటేశ్వర్‌రావు, డీపీవో దేవరాజ్, మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు, వైస్ చైర్మన్ రమాదేవి, కమిషనర్, ఎంపీడీవో సంతోష్‌కుమార్, మండల పంచాయతీ అధికారి సుమ, ఎఫ్‌ఆర్వో భూమేశ్, ఎంఈవో గంగాధర్ ఉన్నారు.

వీళ్లతో మాట్లాడాక.. హాయ్ పెడతా

- వివాహితకు మృతుడి చివరి వాయిస్ మేసేజ్
- సంగెం మెయిన్ కెనాల్‌లో లభించిన బైక్
- సమీర్ హత్యోందం : 24 గంటల్లో వీడిన మిస్టరీ
- పోలీసుల అదుపులో నిందితులు


షేక్ సమీర్(ఫైల్)

కోరుట్ల: 'నేను వీళ్లతో మాట్లాడుతున్న.. తర్వాత నీకు హాయ్ పెడత.. అప్పుడు ఫోన్ చెయ్' అని ఓ వివాహితకు పెట్టిన చివరి వాయిస్ మేసేజ్ సమీర్ హత్య కేసు నిందితులను పట్టించింది. బుధవారం రాత్రి కనిపించకుండా పోయిన పట్టణానికి చెందిన సమీర్(25) మృతదేహం పట్టణ శివారులోని ఎస్సారెస్పీ డీ–40 కెనాల్‌లో లభించడం కలకలం రేపింది. యువకుడి మృతదేహం లభించిన 24 గంటల వ్యవధిలోనే సీఐ ప్రవీణ్ కుమార్, ఎస్సై కిరణ్.. నిందితులను అదుపులోకి తీసుకోవడం విశేషం.

వివాహితతో సాన్నిహిత్యం..

ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న షేక్ సమీర్ కొంతకాలంగా ఓ వివాహితతో సన్నిహితంగా ఉంటున్నాడు. ఆమెతో ఇప్పటికే సన్నిహితంగా ఉండే మరో వ్యక్తికి ఇది నచ్చలేదు. దీంతో తరచూ గొడవ పడుతున్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే బుధవారం రాత్రి సంగెం మెయిన్ కెనాల్‌కు అనుబంధంగా ఉన్న డీ–40 కెనాల్ వద్దకు వచ్చిన ఇద్దరు.. సమీర్‌తో గొడవ పడ్డట్లు సమాచారం. ఈ సమయంలోనే సమీర్.. తాను 'హాయ్' పెట్టేవరకు ఫోన్ చేయద్దని సదరు వివాహిత ఫోన్‌కు వాయిస్ మేసేజ్ పంపినట్లు సమాచారం. సమీర్‌తో గొడవ పడ్డ ఇద్దరు అతడిని హతమార్చి మోటార్‌సైకిల్‌తో సహా మెయిన్ కెనాల్‌లోకి తోసేసినట్లు పోలీసుల విచారణలో తేలింది. డీ–40 కాలువలో సమీర్ మృతదేహం కొట్టుకువచ్చి ఇటుక బట్టీల వద్ద తేలింది. సమీర్ బావ ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు.. వాయిస్ మేసేజ్ ఆధారంగా విచారణ చేసి సమీర్ హత్యలో పాలుపంచుకున్న ఇద్దరిని శుక్రవారం రాత్రి అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. వీరిని విచారించిన సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్సై కిరణ్.. శనివారం ఉదయం సంగెం మెయిన్ కెనాల్‌లో సమీర్ తీసుకెళ్లిన మోటార్‌సైకిల్‌ను గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. మొత్తమ్మీద 24 గంటల వ్యవధిలోనే పోలీసులు సమీర్ హత్యోదంతంలో మిస్టరీని ఛేదించారు.

ఆర్టీసీ కార్మికుల ధర్నా



జగిత్యాలటౌన్: ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే బిల్లును గవర్నర్ వెంటనే ఆమోదించాలని కోరుతూ టీఎంయూ ఆధ్వర్యంలో శనివారం స్థానిక డిపో ఎదుట ఆందోళన చేశారు. దీంతో ఉదయం 6గంటల నుంచి 8 గంటల వరకు బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. కార్మిక సంఘం నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే బిల్లును గవర్నర్‌కు పంపించగా, ఆమోదించకుండా పక్కన పెట్టడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో నాయకులు రమేశ్‌రావు, పత్తిపాక రాములు తదితరులు పాల్గొన్నారు.

పరిహారం చెల్లించకుంటే ఆందోళనలు

- డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్


ఇసుక మేటలు పరిశీలిస్తున్న లక్ష్మణ్‌కుమార్

పెగడపల్లి(ధర్మపురి): భారీ వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ హెచ్చరించారు. వరదలతో దెబ్బ తిన్న పంటలు, ఇసుక మేటలను శనివారం ఆయన పరిశీలించారు. వరదలతో వరినారు నీట మునిగిందని, వ్యవసాయ భూముల్లో ఇసుక మేటలు వేసి సేద్యానికి పనికాకుండా పోయాయన్నారు. అకాల వర్షాలతో రైతులు ఆర్థికంగా నష్టపోయినా అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదని విమర్శించారు. బాధిత రైతులకు పరిహారం చెల్లించాలని అసెంబ్లీలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు డిమాండ్ చేస్తుంటే భరోసా కల్పించాల్సిన అధికార పార్టీ ఎమ్మెల్యేలు.. తమపైనే ఎదురుదాడికి దిగడం శోచనీయమన్నారు. బాధిత రైతులకు పరిహారం అందించేందుకు జిల్లా మంత్రి ఈశ్వర్ బాధ్యత తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాములుగౌడ్, ఏఎంసీ మాజీ చైర్మన్ శ్రీనివాస్, నాయకులు రవి, అశోక్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, రాజు, సతీశ్, రమేశ్, గంగాధర్, రాజేశం, రాజేందర్, వంశీధర్‌రావు, రామగౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, నగేశ్, మల్లయ్య, తిరుపతి, జితేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

కొండగట్టులో పూజలు

కొండగట్టు(చొప్పదండి): డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ శనివారం కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు. స్వామివారి దయతో త్వరలోనే కోర్టు తీర్పు తమకు అనుకూలంగా వస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ సునీల్, అర్చకుడు చింటూ తదితరులు పాల్గొన్నారు.

రెండు ఆలయాల్లో చోరీ

కోరుట్లరూరల్: సంగెం గ్రామ శివారులోని అతిపురాతన సంగమేశ్వర, ఎల్లమ్మ ఆలయాల్లో చోరీ జరిగింది. శుక్రవారం రాత్రి దొంగలు ఆలయ ద్వారాలు తెరిచి లోనికి ప్రవేశించారు. హుండీ తాళాలు పగులగొట్టారు. సంగమేశ్వర ఆలయంలోని హుండీలో సుమారు రూ.30 వేల – రూ.40వేలు ఎత్తుకెళ్లారు. ఎల్లమ్మ ఆలయం గేటు తాళాలు పగులగొట్టారు. కోరుట్ల రెండో ఎస్సై ఇంద్రకరణ్‌రెడ్డి సంఘటనా స్థలాలను పరిశీలించారు. జగిత్యాల క్లూస్ టీమ్ ఆలయ పరిసరాలు పరిశీలించి ఆనవాళ్లు సేకరించింది. కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై వివరించారు.

ఆభరణాలు అపహరించిన దొంగ అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న సీఐ లక్ష్మీనారాయణ


స్వాధీనం చేసుకున్న ఆభరణాలు

- వెల్లడించిన సీఐ లక్ష్మీనారాయణ

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): ఓ మహిళను నమ్మించి బంగారు ఆభరణాలు దోచుకెళ్లిన దొంగను అరెస్ట్ చేసినట్లు మెట్‌పల్లి సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మెట్‌పల్లి మండలం కోనరావుపేట గ్రామానికి చెందిన స్వరూప గతనెల 3న మెట్‌పల్లిలోని ఆంధ్రాబ్యాంకులోకి వెళ్లింది. ఆధార్‌కార్డు జిరాక్స్ అవసరం ఉండగా బయటకు వచ్చింది. జిరాక్స్ సెంటర్ ఆచూకీ కోసం చూస్తుండగా అక్కడే ఉన్న మెట్‌పల్లికి చెందిన గొట్టెముక్కల సాయికుమార్ ఆమెకు మాయమాటలు చెప్పాడు. జిరాక్స్ సెంటర్ చూపిస్తానని స్కూటీపై ఎక్కించుకుని అమ్మక్కపేట శివారులోని రైల్వే ట్రాక్ వద్దకు తీసుకెళ్లాడు. అక్కడ జనం ఉండడంతో వెనక్కి వచ్చాడు. తర్వాత గండిహన్మాన్ దేవాలయ సమీపంలోని అడవిలోకి తీసుకెళ్లాడు. బండరాయితో కొట్టి చంపుతానని బెదిరించి ఆమె మెడలోని 3 తులాల పుస్తెలతాడు, చెవికమ్మలు దోచుకెళ్లాడు. ఎలాగోలా ఆటోలో ఇంటికి వెళ్లిన బాధితురాలు.. భర్త శ్రీనివాస్‌కు విషయం చెప్పింది. ఈమేరకు వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. సీసీ ఫుటేజీల ఆధారంగా నిందితుడిని గుర్తించారు. ఈక్రమంలో శనివారం రాజేశ్వర్‌రావుపేట గ్రామ శివారులో వాహనాల తనిఖీ చేపట్టారు. నిందితుడు మెట్‌పల్లిలో లక్ష్మి కన్సల్టెన్సీలో అద్దెకు తీసుకున్న స్కూటీపై నగలు విక్రయించేందుకు నిజామాబాద్ జిల్లా మోర్తాడ్‌కు వెళ్తుండగా పోలీసులు కనిపించారు. దీంతో సాయికుమార్ పోలీసులను చూసి పారిపోయేందుకు యత్నించాడు. పోలీసులు అప్రమత్తమై నిందితుడిని పట్టుకున్నారు. నిందితుడి నుంచి 3 తులాల పుస్తెలతాడు, చెవికమ్మలు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుడిని పట్టుకున్న ఎస్ఐ ఉమసాగర్, కానిస్టేబుళ్లు కిరణ్, సంతోష్, అనిల్‌ను ఎస్పీ భాస్కర్ అభినందించారు.

నృసింహునికి పూజలు

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. తొలుత గోదావరి నదిలో స్నానాలు ఆచరించారు. అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు.

బాధితులను ఆదుకుంటాం


మాట్లాడుతున్న బండి సంజయ్‌కుమార్

కథలాపూర్(వేములవాడ): భారీవర్షాలతో పంటలు, ఆస్తి నష్టపోయిన బాధితులకు పరిహారం ఇచ్చి ఆదుకుంటామని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్ హామీ ఇచ్చారు. శనివారం రాత్రి బీమారం మండలం గోవిందారం, రాజలింగంపేట గ్రామాల్లో వర్షాలకు వరద బాధితులను పరామర్శించారు. రాజలింగంపేటలో భారీవర్షాలతో గోవిందరాజుల చెరువు తెగిందని, వరద ఉధృతికి పౌల్ట్రీఫారం కొట్టుకుపోయిందని, పంటలు దెబ్బతిన్నాయని బాధితులు ఎంపీకి విన్నవించారు. రాజలింగంపేటలో వరదలో చిక్కుకున్న ముగ్గురిని కాపాడిన యువకులను శాలువాలతో సన్మానించారు. గోవిందారం శివారులో కొత్తగా నిర్మించిన వంతెన కొట్టుకుపోవడంతో ఆ ప్రాంతాన్ని బండి పరిశీలించారు. నాయకులు కరండ్ల మధుకర్, ముంజ శ్రీనివాస్, ఎస్ఎస్ రెడ్డి, జలపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గోవిందారం దారి పరిశీలన

కొండగట్టు(చొప్పదండి): కొడిమ్యాల మండలం పోతారం చెరువు బ్యాక్ వాటర్‌తో కొడిమ్యాల – గోవిందారం మధ్య రాకపోకలు నిలిచి పోయాయి. దీంతో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌మార్, మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ శనివారం రాత్రి ఆ ప్రాంతాన్ని పరిశీలించారు.

రైతులకు శిక్షణ

జగిత్యాలఅగ్రికల్చర్: పొలాస వ్యవసాయ శాస్త్రవేత్తలు దత్తత తీసుకున్న అల్లీపూర్ గ్రామంలో శనివారం భూసార ఆధారిత ఎరువుల యాజమాన్యంపై రైతులకు శిక్షణ ఇచ్చారు. భూసార పరీక్ష ఫలితాల కార్డులు పంపిణీ చేశారు. శాస్త్రవేత్తలు మాట్లాడుతూ, ఇష్టం వచ్చినట్లు రసాయన ఎరువులు వినియోగిస్తే పంటకు ఉపయోగం కన్నా.. సారవంతమైన నేలలు పనికి రాకుండా పోతున్నాయన్నారు. చీడపీడల ఉధృతి పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. శాస్త్రవేత్తలు పి.రవి, ఓంప్రకాశ్, ఆర్థిక శాస్త్రవేత్త రజనీదేవి, ఏఈవో సుమలత, సర్పంచ్ గంగారెడ్డి, ఎంపీటీసీ వెంకటేశ్వర్లు, ఆర్‌బీఎస్ కో ఆర్డినేటర్ సత్యం, రైతులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు నష్టం


మాట్లాడుతున్న ప్రవీణ్

జగిత్యాలఅగ్రికల్చర్: భారీవర్షాలతో చెరువులకు గండ్లు పడి చేపలు కొట్టుకుపోయానని, మత్స్యకారులు ఉపాధి కోల్పోయారని జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు ప్రవీణ్ అన్నారు. జిల్లా కేంద్రంలో ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. వరదల ఉధృతికి చెరువుల్లోని విలువైన చేపలు దిగువకు కొట్టుకుపోయాయని తెలిపారు. నష్టాన్ని అంచనా వేసి మత్స్యకారులను ఆదుకోవాలని కోరారు. చాలా చెరువులు కబ్జాలకు గురవుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. మత్స్య సహకార సంఘాల నాయకులు భూమేశ్, తోకల రాజు, రూప, శ్రీనివాస్, రాజమల్లు, లచ్చయ్య, అరవింద్ పాల్గొన్నారు.

వివాహితను వేధించిన వ్యక్తి అరెస్ట్

గొల్లపల్లి(ధర్మపురి): మండల కేంద్రానికి చెందిన దండ్ల కనకలక్ష్మి – నగేశ్ కూతురు స్వరూపను లైంగికంగా వేధించిన పల్లెపు మహేందర్‌ను అరెస్టు చేసినట్లు జగిత్యాల డీఎస్పీ వెంకటస్వామి శనివారం రాత్రి తెలిపారు. తన కూతురును వేధిస్తున్న మహేందర్‌పై ఫిర్యాదు చేసినా పోలీసులు కేసు నమోదు చేయడంలేదనే మనస్తాపంతో కనకలక్ష్మి శుక్రవారం రాత్రి స్థానిక ఠాణా ఎదుట పురుగుల మందు తాగిన విషయం విదితమే. ఆమెను ఆస్పత్రిలో చేర్పించిన పోలీసులు.. స్వరూపను వేధిస్తున్న మహేందర్‌ను రిమాండ్‌కు తరలించారు. కాగా, పల్లెపు మహేందర్ తనను లైంగికంగా వేధిస్తున్నాడని స్వరూప జూన్ 25న పోలీసులకు ఫిర్యాదు చేసిందని, అదేరోజు కేసు నమోదు చేయగా, నిందితుడు పరారీలో ఉన్నాడని డీఎస్పీ తెలిపారు. జూలై 30న కోరుట్లలో అదుపులోకి తీసుకుని ఈనెల 2న గొల్లపల్లి ఠాణాలో హాజరు కావాలని నోటీసు ఇచ్చామన్నారు. అయినా, హాజరు కాకపోవడంతో కోర్టు ఆదేశాలతో అరెస్టుకు రంగం సిద్ధం చేశామన్నారు. ఈలోగా బాధితురాలి తల్లి క్షణికావేశంలో ఆత్మహత్యకు యత్నించిందన్నారు. పోలీసులపై బాధితులు చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదని, ఇలాంటి ఆరోపణలు నమ్మవద్దని, వాస్తవాలు తెలుసుకోవాలని డీఎస్పీ సూచించారు.

ఇంటికో ఇంకుడుగుంత తప్పనిసరి

- స్వచ్ఛ సర్వేక్షణ్ కేంద్ర బృందం సభ్యులు అయ్యాస్, శ్రీనివాస్
- గ్రామాల్లో విస్తృత పర్యటన


మాట్లాడుతున్న ప్రతినిధులు

జగిత్యాలరూరల్: గ్రామాల్లో ఇంటికో ఇంకుడు గుంత తవ్వించేలా చూడాలని స్వచ్ఛ సర్వేక్షణ్ కేంద్ర బృందం సభ్యులు అయ్యాస్, శ్రీనివాస్ సూచించారు. శనివారం పొరండ్ల, చల్‌గల్ గ్రామాల్లో స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ కార్యక్రమంలో భాగంగా కేంద్ర బందం సభ్యులు ఇంటింటా పర్యటించారు. ఇంకుడుగుంతల అవసరంపై అవగాహన కల్పించారు. అనంతరం ఇంటింటా పర్యటించి వైకుంఠధామం, వర్మికంపోస్ట్ షెడ్డు, ఇంకుడుగుంతలు, మరుగుదొడ్లను పరిశీలించారు. మరుగుదొడ్ల వినియోగం, వృథా నీటి వినియోగంపై గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. వృథా నీటిని ఇంకుడుగుంతల్లోకి మళ్లించాలని, తడి, పొడి చెత్త సేకరణపై ప్రజలకు అవగాహన ఉండాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు పొగ్గ సంధ్యారాణి, ఏల్ల గంగనర్సు, ఏపీడీలు నరేశ్, శివాజీ, ఎంపీడీవో రాజేశ్వరి, ఎంపీవోలు రవిబాబు, ఏపీఎం గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

శుభ్రత పాటిస్తున్నారా?

కథలాపూర్(వేములవాడ): దుంపేట, తాండ్ర్యాల గ్రామాల్లో స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం సభ్యులు శనివారం పర్యటించారు. గ్రామాల్లో పారిశుధ్యం నిర్వహణ, తడి, పొడి చెత్త సేకరణ, ఇంకుడుగుంతల నిర్మాణం, వినియోగం, ఇంటింటా మరుగుదొడ్డి తదితర సౌకర్యాలపై ఆరా తీశారు. పారిశుధ్య పనులు ఎలా చేస్తున్నారని గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సభ్యులు నరేంద్ర, సయ్యద్ అలీ, డీఆర్డీవో విజిలెన్స్ అధికారి చిన్నయ్య, ఎంపీడీవో జనార్దన్, ఏపీఎం నరహరి, ఏపీవో రాజేందర్, సర్పంచులు అంబటి లత, గడీల గంగప్రసాద్, వైస్ ఎంపీపీ కిరణ్‌రావు, కో ఆప్షన్ సభ్యుడు ఎండీ రఫీక్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యాలయానికి తాళం

- మళ్లీ తీసిన ఉప సర్పంచ్

కోరుట్ల: ధర్మారం గ్రామ పంచాయతీ కార్యాలయానికి ఉప సర్పంచ్ తాళం వేసి మళ్లీ తెరిచారు. ఈ సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. సర్పంచ్ ఇప్ప మంగ భర్త రాజేందర్ తనను సంప్రదించకుండానే గ్రామంలో ఇష్టానుసారంగా అభివృద్ధి పనులు చేస్తున్నారని ఆగ్రహించిన ఉప సర్పంచ్ మురళి.. గ్రామ పంచాయతీ కార్యాలయానికి తాళం వేశారు. మళ్లీ కొద్దిసేపటి తర్వాత తాళం తెరిపించాడు. ఇద్దరు నాయకులు అధికార పార్టీ మద్దతు దారులైనా కొద్దిరోజులుగా పొసగటం లేదని తెలిసింది. విషయం తెలిసిన ఎంపీపీ తోట నారాయణ, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు చీటి వెంకట్రావు, సర్పంచుల ఫోరం గౌరవ అధ్యక్షుడు దారిశెట్టి రాజేశ్ వెంటనే ధర్మారం గ్రామానికి వెళ్లారు. సర్పంచ్ భర్త, ఉప సర్పంచ్ మధ్య సయోధ్య కుదిర్చినట్లు తెలిసింది.

ఉపాధ్యాయుల ఆందోళన


వినతిపత్రం అందిస్తున్న ఉపాధ్యాయులు

జగిత్యాలజోన్: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ జగిత్యాల శాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు శనివారం స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. అనంతరం జెడ్పీ సీఈవో రామానుజాచారికి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బోగ రమేశ్ మాట్లాడుతూ, ఉపాధ్యాయుల జీపీఎఫ్‌లో రూ.వెయ్యి కోట్లు మిస్సింగ్ క్రెడిట్స్ ఉన్నాయన్నారు. వాటిని ఉపాధ్యాయుల ఖాతాల్లో జమచేయాలని ఆయన డిమాండ్ చేశారు. సాధారణ భవిష్య నిధిపై ఆర్థిక ఆంక్షలు తొలగించాలని ఆయన కోరారు. 2006 నుంచి 2022 వరకు జెడ్పీ జీపీఎఫ్‌లకు వడ్డీ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొక్కుల రాంచంద్రం, గౌడుగు రఘుపతియాదవ్, కూరగాయల చంద్రశేఖర్, ఎడ్ల గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

10 నుంచి పోర్టిఫైడ్ బియ్యం పంపిణీ

రాయికల్:(జగిత్యాల) నిరుపేదలకు పోషక విలువలు అందించి ఆరోగ్యం మెరుగుపర్చాలనే ఉద్దేశంతో ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా పోర్టిఫైడ్ బియ్యం పంపిణీ చేసేందుకు నిర్ణయించింది. జిల్లాలోని ఐదు మున్సిపాలిటీలతోపాటు, 20 మండలాల్లోని అన్ని రేషన్ దుకాణాల్లో ఈనెల 10 నుంచి బియ్యం అందజేసేందుకు జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఆహారభద్రత కార్డు ఉన్న ప్రతీ సభ్యుడికి ఉచితంగా ఆరు కిలోలు ఇవ్వనున్నారు. జిల్లాలోని 592 రేషన్ దుకాణాల్లో 2,92,895 ఆహారభద్రత కార్డులు ఉండగా, 8,47,837 మంది లబ్ధిదారులు ఉన్నారు. ఇందులో ఒక్కొక్కరికి ఆరు కిలోల చొప్పున పోర్టిఫైడ్ బియ్యం పంపిణీ చేయనున్నారు.

బియ్యంలో ఏమున్నాయంటే..

పోర్టిఫైడ్ బియ్యంలో ఐరన్, పోలిక్ యాసిడ్, విటమిన్ –ఏ, జింక్ తదితర పోషకాలు ఉంటాయి. క్వింటాలు సాధారణ బియ్యానికి కిలో పోర్టిఫైడ్ కలిపి పంపిణీ చేస్తారు. మిల్లుల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బ్లెడింగ్ యూనిట్లలో ఈ ప్రక్రియ చేపడతారు.